ప్రజాశక్తి

శుక్రవారం 17 జనవరి 2025

5

పార్వతీపురం మన్యం

ఆర్‌టిసి ప్రయాణం సురక్షితం : డిఎం

ప్రజాశక్తి - పాలకొండ

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం డిపోలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సును డ్రైవర్లు ఏకాగ్రతతో నడిపి ప్రయాణికులను సురక్ష ప్రాంతాలకు చేర్చాలన్నారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో వాహనాలు జాగ్రత్తగా నడపాలన్నారు. ఫిబ్రవరి 15 వరకు మాసోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ జగన్నాథం, ఎడిసిలు బాసుర కృష్ణమూర్తి, డిఎస్‌వి రాజు, జగన్నాథం ఉన్నారు.

సాలూరు ఏరియా ఆస్పత్రి

ధర్మాసుపత్రిలో అంతర్యుద్ధం

- వైద్యుల మధ్య ముఠా తగాదాలు
- సూపరింటెండెంట్ పై కలెక్టర్‌కు ఫిర్యాదు
- సీనియర్ డాక్టర్ ఉద్యోగోన్నతికి మంత్రి బ్రేక్

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ఏరియా ఆసుపత్రిలో గత కొంతకాలంగా అంతర్యుద్ధం కొనసాగుతోంది. వైద్యుల మధ్య గ్రూపు తగాదాలు చాపకింద నీరులా విస్తరిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నకుమారి, మరికొంత మంది వైద్యుల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం జరుగుతోంది. జూనియర్ డాక్టర్‌కు సూపరింటెండెంట్ బాధ్యతలు అప్పగించడంపై కొంతమంది సీనియర్ డాక్టర్లు అసంతృప్తితో రగిలిపోతున్న పరిస్థితి నెలకొంది. దీని ఫలితంగా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది మధ్య ముఠాలు ఏర్పడ్డాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొద్ది నెలల క్రితం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నకుమారిపై ఆసుపత్రిలో పని చేస్తున్న సిబ్బంది జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. సూపరింటెండెంట్ తమను వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఫిర్యాదు లో పేర్కొన్నట్లు సమాచారం.

సీనియర్ డాక్టర్ ఉద్యోగోన్నతికి జిల్లా మంత్రి బ్రేక్!

ఆసుపత్రిలో సీనియర్ డాక్టర్ గా పని చేస్తున్న మీనాక్షికి దక్కిన సూపరింటెండెంట్ కుర్చీని దక్కకుండా జిల్లా మంత్రి అడ్డుపుల్ల వేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆమె కంటే జూనియర్ అయిన డాక్టర్ రత్నకుమారిని సూపరింటెండెంట్ చేయడంతో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది జీర్ణించుకోలేక పోతున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే డాక్టర్ మీనాక్షిను గత ప్రభుత్వం హయాంలోనే సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అప్పుడు కూడా ఆమె నియామకానికి కొంతమంది వైసిపి నాయకులు అడ్డుపుల్ల వేయడంతో ఆ ఉత్తర్వులు అమలు కాలేదు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల కొద్దిరోజుల క్రితం ఆమెను మళ్లీ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తనకు తెలియకుండా, తనను సంప్రదించకుండా సూపరింటెండెంట్ గా నియామక ఉత్తర్వులు జారీ చేయడాన్ని మంత్రి సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. జారీ అయిన ఉత్తర్వులు అమలు కాకుండా మంత్రి ఉన్నతాధికారులపై ఒత్తిడి చేయడంతో డాక్టర్ మీనాక్షికి మరోసారి నిరాశ ఎదురైందన్న చర్చ జరుగుతోంది.

అటవీ విస్తరణ పెంపునకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో అటవీ విస్తీర్ణం పెంచి పచ్చదనం విస్తరించేందుకు జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో అధికారులు పటిష్టమైన చర్యలు చేపడుతున్నారు. జిల్లా ఏర్పడిన తర్వాత మారుమూల గ్రామాలతో పాటు అటవీ ప్రాంతాలతో సంబంధం ఉన్న గిరిశిఖర ప్రాంతాల్లో రహదారుల విస్తర్ణకు అటవీ శాఖ తమ నిబంధనలను సరళతరణం చేసింది. దీనివల్ల, రహదారుల అభివృద్ధి పనులకు కొంతవరకు అడవుల విస్తీర్ణం కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందుకు ప్రతిగా రెవెన్యూతో పాటు ఇతర శాఖల నుంచి దఖలుపడిన భూముల్లో అడవులను విస్తరించి పర్యావరణం పెంపు చర్యలకు ఉపక్రమించారు. జిల్లాలో పార్వతీపురంలో 26,301.07 హెక్టార్లు, పాలకొండలో 20,507.74, సాలూరులో 28,230.91, కురుపాంలో 32,681.66 హెక్టార్లు కలిపి మొత్తం 1,07,721,38 హెక్టార్లలో అడవులున్నాయి. ఈ ఏడాది పార్వతీపురం, కొమరాడ, సీతానగరం, గరుగుబిల్లి, పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, భామిని మండలాల పరిధిలో అటవీ విస్తీర్ణం మరింత పెంచేలా చర్యలు చేపట్టనున్నారు.

ఈ విషయమై జిల్లా అటవీ శాఖ అధికారి జిఎపి ప్రసూన మాట్లాడుతూ అటవీ విస్తీర్ణం పెంపే లక్ష్యంగా జిల్లాలో పలు మండలాల్లో 18 నర్సరీల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వాటిలో 16.16 లక్షల మొక్కలు పెంచుతున్నామని, అందుకుగాను అటవీ సెక్షను, బీట్ అధికారులకు బాధ్యతలను అప్పగిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రహదారులు, గ్రానైట్ అనుమతులు తదితర అవసరాలకు అటవీ భూమి మంజూరు చేస్తున్నామని. దీనికి సమానంగా మరో చోట భూమి తీసుకుంటున్నటు తెలిపారు. ఈ విధంగా వివిధ పథకాల నుంచి 312 హెక్టార్లలో 245 స్థలాలు లభించాయని ఆయా ప్రాంతాల్లో మొక్కలు బాధ్యతగా నాటుతున్నామన్నారు. జిల్లాలో టేకు, గుగ్గిలం, నీలగిరి లాంటి విలువైన వనాల పెంపకంపై దృష్టి పెట్టాం. 2024 ముగింపు నాటికి 452.15 హెక్టార్లలో టేకు, 99.02 హెక్టార్లలో గుగ్గిలం, 22.15 హెక్టార్లలో నీలగిరి పెంచుతున్నామని తెలిపారు. జిల్లాలో ప్రవేశించిన ఏనుగుల గుంపులు కలిగిస్తున్న నష్టాలకు పరిహారం వెంటనే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అలాగే ఏనుగులను నియంత్రించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. కుంకీ ఏనుగులను కర్ణాటక నుంచి తెప్పిస్తున్నామని, వాటిని నియంత్రించేందుకు, సెక్షన్ అధికారితో పాటు ఇద్దరు గార్డులకు శిక్షణ ఇప్పిస్తున్నట్టు తెలిపారు. ఇందుకుగానూ సీతానగరం మండలం జోగింపేట అడవుల్లో కుంకీల స్థావరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. భామిని, కురుపాం ప్రాంతాల్లో తిరుగుతున్న 11 ఏనుగుల పర్యవేక్షణను ప్రత్యేక రేంజ్ అధికారి, 38 మంది ట్రాకర్లతో పాటు సెక్షను, బీట్ సిబ్బంది చూస్తున్నారని, కరిరాజుల బారిన పడి పాడైన పంటలకు సంబంధించి రూ.45 లక్షలు చెల్లించడానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు.

జీడి పప్పు ప్రాసెసింగ్‌కు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో జీడి పప్పు ప్రాసెసింగ్‌కు సిద్ధం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్వతీపురం, వీరఘట్టంలలో గిడ్డంగులు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవచ్చని సూచించారు. సాలూరు, గుమ్మలక్ష్మీ పురం, కురుపాంలలో ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. అందుకు అవసరమగు యంత్ర పరికరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రాసెసింగ్ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాలని ఆదేశించారు. గోనె సంచులు కూడా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ప్రాసెసింగ్ కేంద్రాల వద్ద అవసరమగు పరికరాలు, సిబ్బంది, సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇప్పించాలని ఆదేశించారు. ప్రాసెసింగ్ కేంద్రాలకు అవసరమైన ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సీతంపేట ప్రాంతంలో ఇప్పటికే ప్రాసెసింగ్ జరుగుతుందని, వీటి ఆధారంగా లైసెన్సు తదితర అంశాలను కూడా పరిశీలించాలని ఆయన చెప్పారు. డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ వై సత్యం నాయుడు మాట్లాడుతూ గుమ్మలక్ష్మీ పురం, సాలూరు, మక్కువలో రెండు చొప్పున ప్రాథమిక ప్రాసెసింగ్ సెంటర్లు ప్రస్తుతానికి ఉన్నాయని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు పిఒ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, అధికారులు

ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోండి

ప్రమాదాలను నివారించండి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకుని ప్రమాదాలను నివారించడానికి కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభోత్సవం సందర్భంగా గోడపత్రికలు, కరపత్రాలను విడుదల చేశారు. జాతీయ రహదారుల సంస్థ (నేషనల్ హైవే అథారిటీ), రహదారుల మంత్రిత్వ శాఖ - రహదారులపై సురక్షిత ప్రయాణం (సడక్ సురక్ష అభియాన్) ప్రచారం - 2025లో భాగంగా ఫిబ్రవరి 15 వరకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు కల్పిస్తామన్నారు. ఇందులో భాగంగా రోడ్డు భద్రతా ప్రచార సామగ్రి, కరపత్రాలు, బ్రోచర్లతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రోడ్డు భద్రత అవగాహన కోసం వాలంటీర్లను గుర్తించి శిక్షణ ఇవ్వడం, వాహన డ్రైవర్లకు ఆరోగ్య తనిఖీ, కంటి పరీక్షలు నిర్వహణ, రోడ్డు భద్రత అమలు, అవగాహన కార్యకలాపాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఎన్‌హెచ్, ఎస్‌హెచ్‌లో బ్లాక్ స్పాట్‌లను సరిదిద్దడానికి వ్యూహాన్ని సిద్ధం చేయడం, శిక్షణ పొందిన వాలంటీర్లు కళాశాల విద్యార్థులతో వాకథాన్ నిర్వహించడం, వివిధ కార్యక్రమాలు ద్వారా రోడ్డు ప్రమాదాలకు గల వివిధ కారణాల గురించి అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, జిల్లా రవాణా అధికారి టి.దుర్గాప్రసాద్‌రెడ్డి, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శశికుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.సీతారాం, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జి.సత్యనారాయణ, ఎన్.రమేష్ కుమార్, బి.కాశీరాంనాయక్, మెడికల్ ఆఫీసర్ పి.నారాయణరావు, హెూంగార్డులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చదురు గుడి వద్ద వేస్తున్న చలువ పందిళ్లు

ముస్తాబవుతున్న శంబర

- యాత్రికులకు సౌకర్యంగా ఉండేలా విశాల రహదారులు
- వనం, చదురుగుడుల వద్ద చలువ పందిళ్లు

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర జాతరగా అవతరించి రెండో ఏడాదిలోకి అడుగుపెట్టిన శంబర పోలమాంబ అమ్మవారి ఆలయాలు కొంగత్త హంగులు సంతరించుకుని ఈనెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న జాతరకు శంబర ముస్తాబవుతోంది. గతేడాది కంటే భిన్నంగా సుమారు రూ.2.40కోట్లు నిధులతో వనం గుడి, చదురు గుడుల వద్ద, అలాగే గ్రామంలోని సిరిమాను తిరిగే ప్రధాన రహదారులు విశాలంగా నిర్మించారు. ఈసారి అమ్మవారి దర్శనానికి వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చదురుగుడి సమీపంలో క్యూలైన్‌లో వద్ద చలువ పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే కేశఖండన చేసే ప్రాంతాన్ని కూడా చదును చేసి విశాల ఫ్లాట్ ఫాంలు నిర్మించారు. ఇదిలా ఉండగా వనం గుడి వద్ద రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను ఇటీవలే తొలగించారు. దీంతో అక్కడ రహదారి విశాలంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శనానికి అవకాశం కల్పించేలా పనులు చేస్తున్నారు.

కమిటీపై కాలయాపన ఎందుకో..?

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి జాతర విషయంలో కూడా కమిటీ ఏర్పాటులో కాలయాపన జరుగుతోందని సర్వత్రా విమర్శలు వెళువెత్తుతున్నాయి. గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయికి అభివృద్ధి చెందిన జాతరగా గుర్తింపు పొందినప్పటికీ కమిటీ నియామకంలో తాత్సరం ఎందుకు జరుగుతోందనన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. జాతర ప్రారంభానికి పది రోజులే గడువున్నప్పటికీ ఉత్సవ కమిటీ ఏర్పాటుకు అడుగులు పడడం లేదు. రాజకీయంగా ముడిపడి ఉన్న కమిటీ ఏర్పాటుపై టిడిపి నాయకత్వానికి స్పష్టత లేకపోవడం ఒకంత ఆశ్చర్యానికి తావిస్తోందని పలువురు భావిస్తున్నారు. గ్రామ స్థాయిలో కమిటీ లేకుండా జాతర నిర్వహణ జరిగినట్లయితే ఇది కూడా ఒక చరిత్రగా చెప్పుకోవచ్చున్నది మరి కొంతమంది అభిప్రాయ పడుతున్నారు.

జనరేటర్‌లో మంటలు

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - కురుపాం

జనరేటర్‌లో మంటలు రేగి పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన గురువారం ఉదయం స్థానిక ఎస్ఎన్సీయూ ఆరోగ్య కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం ఆరోగ్య కేంద్రంలో వినియోగించే జనరేటర్ లోపల నుంచి పూర్తిగా మంటలు చెలరేగి దట్టమైన పొగ కమ్ముకుంది. వెంటనే స్పందించి మంటలను అదుపు చేశారు. దీంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని, పసిపిల్లలకు వైద్యం చేసే ఎస్ఎన్సీయూ' కేంద్రాల్లో ఇలాంటి ప్రమాదం జరగడంతో ఆందోళన చెందుతున్నామని స్థానికులు చెబుతున్నారు. సిబ్బంది, జనరేటర్ పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించి, రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మంటలను అదుపు చేస్తున్న స్థానికులు

కెవిఆర్ అపార్ట్‌మెంట్ పరిసరాల్లో అపారిశుధ్యం

- రోడ్డు పక్కనే చెత్త పోగులు
- పట్టించుకోని మున్సిపాలిటీ
- ఇబ్బంది పడుతున్న స్థానికులు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ సమీపంలో జైపూర్ రోడ్డులో గల కెవిఆర్ అపార్ట్మెంట్ పరిసరాల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. గత కొంతకాలంగా ఆ అపార్ట్‌మెంట్ వాసులు వారి ఇళ్ల నుంచి వచ్చిన చెత్తాచెదారాలను రోడ్డు పక్కన వేస్తున్నారు. దీంతో ఇరుగుపొరుగునున్న ఇండిపెండెంట్ ఇళ్లవాసులకు తీవ్రదుర్గంధం వెదజల్లుతోంది. పట్టణ పారిశుధ్య విభాగం సిబ్బంది ఈ చెత్తాచెదారాలను తరలించడం లేదు. దీంతో రోజుల తరబడి పేరుకుపోయిన చెత్తతో దోమల ఉత్పత్తి కూడా పెరుగుతోంది. దీనిపై సమీపంలో ఉన్న ఇండిపెండెంట్ ఇళ్ల వాసులు మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. మున్సిపల్ అధికారులు అసలు స్పందించకపోవడానికి కారణాలు కూడా ఉన్నాయి. కెవిఆర్ అపార్ట్మెంట్‌లో గల 93 ప్లాట్లకు సంబంధించిన పనులు గత కొంతకాలంగా మున్సిపాలిటీకి చెల్లించడం లేదని తెలుస్తోంది. ఈ అపార్ట్మెంట్‌లో కొంతమంది ప్లాట్లను కొనుగోలు చేసుకుని నివాసం వుంటున్నారు. ఇంకొంతమంది ప్లాట్లలో అద్దెకు నివసిస్తున్నారు. అమ్మకమైన ప్లాట్లకు సంబంధించి ఇంటి పన్నులను మున్సిపాలిటీకి నివాసితులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఆ విధంగా వారు చెల్లించకపోవడంతో చెత్తను పారిశుధ్య కార్మికులు తరలించడం లేదు. ఎందుకంటే వారు పన్నులు చెల్లించనందున చెత్తచెదారాలను తరలించడం లేదని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఇంతకీ అపార్ట్మెంట్ వాసులు పన్ను చెల్లించకపోవడానికి అసలు కారణం కెవిఆర్ ఎస్టేట్ యజమాని వైఖరేనని తెలుస్తోంది. ఆయన బిల్డర్‌గా నిర్మించిన అపార్ట్మెంట్‌లో కొనుగోలు చేసిన ప్లాట్లకు బాండ్ పత్రాలను హక్కు దారులకు అందజేయాలి. ఆ పత్రాలను మున్సిపల్ రెవెన్యూ అధికారులకు సమర్పించిన తర్వాత పన్నులు చెల్లించే అవకాశం ఉంటుంది. కెవిఆర్ ఎస్టేట్ యజమాని ఉద్దేశపూర్వకంగానే మున్సిపాలిటీకి పన్నులు ఎగ్గొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఆ అపార్ట్మెంట్ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ వివరణ కోరగా అపార్ట్మెంట్ వాసులు పన్ను చెల్లించడం లేదని, అందుకే అపార్ట్మెంట్ ఇళ్ల నుంచి వచ్చిన చెత్తాచెదారాలను తరలించడం లేదని చెప్పారు. అయితే ఈ అపార్ట్‌మెంట్ వాసులు రోడ్డు పక్కన చెత్తలు వేయడం సరికాదని చెప్పారు. ప్లాట్ల విక్రయించిన కెవిఆర్ ఎస్టేట్ యజమాని వాటికి సంబంధించిన పత్రాలను హక్కుదారులకు అందజేయకుండా తాత్సారం చేస్తున్నారని చెప్పారు.

కెవిఆర్ అపార్ట్‌మెంట్ పరిసరాల్లో పోగుపడ్డ చెత్త

భారీగా తరలిపోతున్న ఇసుక

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పాలకొండ

కూటమి ప్రభుత్వ హయాంలో కొత్తగా తీసుకొచ్చిన ఉచిత ఇసుక అమల్లోకి వచ్చింది. దీంతో సామాన్యులు ఆనందం చెందారు. అయితే ఇసుకసురులు ఉచిత ఇసుక విధానాన్ని తుంగలోకి తొక్కి అక్రమంగా భారీస్థాయిలో తరలిస్తున్నారు. నాగావళ్లి నది తీరం నుంచి ఇసుకను దర్జాగా దోచుకుంటున్నారు. నాగావళి నది తీరాన గల గోపాలపురం నుంచి రోజుకు వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. ట్రాక్టర్ ద్వారా లోడుకు రూ.1500 వరకు ధర పలుకుతుంది. లారీ లోడుకైతే రూ.8వేల నుంచి రూ.10వేలు వరకు ధర పలుకుతుంది. పట్టించుకోవాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఇసుక దందాకు అధికార పార్టీ తెరతీసిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గోపాలపురంలో పట్టపగలే అక్రమ ఇసుక రవాణా జరుగుతుంది. దీన్ని చూసిన వారంతా ముక్కు మీద వేలేసుకుంటున్నారు. గోపాలపురం నుంచి రోజుకు వందలాది వాహనాలతో ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. ఇక్కడి నుంచి ఇతర జిల్లాలకు ఇసుక రవాణా జరుగుతుంది. ఉచిత ఇసుక విధానం అమల్లో ఉన్నప్పటికీ కేవలం నాటుబల్లకే పరిమితమవుతుంది. మండల కేంద్రానికి అతి దగ్గరలో గోపాలపురం వద్ద వాహనాల నుంచి ఇసుక తరలించుకుంటున్నారు. రాత్రీ, పగళ్లన్న తేడా లేకుండా రవాణా జరుగుతుంది. మరోపక్క గోపాలపురం గ్రామస్తులు కూడా ఇసుక అక్రమ రవాణాపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వస్తే విపత్తు సంభవిస్తాదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా ఎవరూ నోరు మెదపడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గోపాలపురం వద్ద నాగావళి తీరంలో లారీలతో తరలిపోతున్న ఇసుక

పేదలకు వరం అన్న క్యాంటీన్లు

రీజనల్ డైరెక్టర్ రవీంద్ర

ప్రజాశక్తి-విజయనగరం

పేదల పాలిట అమృత వరప్రదాయినులుగా అన్నా క్యాంటీన్లు విరాజిల్లుతున్నాయని రీజినల్ డైరెక్టర్ ఆఫ్‌మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రవీంద్ర పేర్కొన్నారు. గురువారం నగరానికి చేరుకున్న ఆయన కమిషనర్ పల్లి నల్లనయ్యతో కలిసి ఘోషాసుపత్రి వద్దనున్న అన్నా కాంటీన్‌ను పరిశీలించారు. పారిశుధ్యం భోజన నిర్వహణ వంటి విషయాలను గమనించారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే క్యూఆర్ కోడ్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. భోజనం చేస్తున్న ప్రజలను కలిసి అన్న క్యాంటీన్ల పనితీరు ఎలా ఉందని అడిగారు. దీంతో వారంతా అన్నా క్యాంటీన్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ పల్లి నల్లనయ్యతో పాటు రీజనల్ డైరెక్టర్ రవీంద్ర కూడా అన్నా క్యాంటీన్‌లో పేదలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా రీజినల్ డైరెక్టర్ రవీంద్ర మాట్లాడుతూ పేదల ఆకలి బాధలను తీర్చే వర ప్రధాయినిగా అన్నా క్యాంటీన్లు అలరారుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్లతో పేద వర్గాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. దాతలు ముందుకు వచ్చి విరాళాలు కూడా అందివ్వవచ్చని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అశుతోష్‌శ్రీవాస్తవ

జన్‌మాన్ పనులు వేగవంతం : పిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

జన్‌మాన్ పనులు వేగవంతం చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. గురువారం స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో పిఎం జన్ మాన్ కార్యక్రమంలో భాగంగా జల్ జీవన్ మిషన్, అంగన్వాడీ, ఆవాస్ యోజన, రహదారులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జల్ జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి తాగు నీరందించాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టిక ఆహారాన్ని అందించాలని, ప్రాథమిక విద్య పట్ల ఆసక్తి కల్పించాలని అన్నారు. గిరిజన గ్రామాల్లో చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన చెప్పారు. గిరిజనులందరికీ ఇళ్లు నిర్మించాలని ఆయన పేర్కొన్నారు. మంజూరైన అన్ని ఇళ్లు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి విజయగౌరి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ నాగేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సిఐ రామకృష్ణ

మత్తు పదార్థాలు రవాణా చేస్తే కేసులు

ప్రజాశక్తి - సాలూరు

ఆర్టీసీ బస్సుల్లో గంజాయి వంటి మత్తు పదార్థాలు రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని రూరల్ సిఐ పి.రామకృష్ణ హెచ్చరించారు. రహదారి భద్రతపై గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సిఐ రామకృష్ణ ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఆర్టీసి డ్రైవర్ లు రహదారి భద్రత కి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాల నడపాలన్నారు. బస్సులో వున్న ప్రయాణీకుల ప్రాణాల విలువ గుర్తు పెట్టుకోవాలని సూచించారు. నిషేధిత మత్తు పదార్థాలు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీ మనుగడకు ప్రయాణీకులే అత్యంత కీలకమన్నారు. వారి భద్రత కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం వుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిఎం భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

కోటి సభ్యత్వాల పట్ల మాజీ ఎమ్మెల్యే హర్షం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

టిడిపి కోటి సభ్యత్వాలు దాటడం పట్ల మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ యువ నాయకుడు నారా లోకేష్ ఆధ్వర్యంలో రికార్డు స్థాయిలో సభ్యత్వాలను నమోదు చేయడం పార్టీ చరిత్రలో సువర్ణ అధ్యాయమని అన్నారు. అలాగే విద్యాశాఖ మంత్రిగా 117 జీవో రద్దు చేసి రాష్ట్రంలో గాడి తప్పిన విద్యావ్యవస్థను తిరిగి గాడిలో పెట్టడానికి ఆయన చేస్తున్న కృషి అమోఘమని అన్నారు.

బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఇటీవల మృతి చెందిన నేరడి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు భీమసింగి రామారావు, బాలేరులో గొర్లె రాజులు కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే జయకృష్ణ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం భామిని మండలంలోని తలడా, ఘనసారా గ్రామాల్లో ఇటీవల చనిపోయిన వారి కుటుంబ సభ్యులు కలిసి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శి ఎం.జగదీశ్వరరావు, టిడిపి మండలం అధ్యక్షులు రవినాయుడు, మాజీ ఎం పి పి భూపతి ఆనందరావు, టిడిపి నాయకులు సాకేటి రామారావు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఒకే చోట కలిసిన పూర్వ విద్యార్థులు

బాలేరులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బాలేరు జిల్లా పరిషత్ హైస్కూల్ 2004-2005 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన వారు ఈ కార్యక్రమంలో పాల్గొని, తమ ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు కలిసి గత జ్ఞాపకాలు తలుచుకుంటూ సరదాగా రోజంతా గడిపారు. ఇటువంటి కార్యక్రమాలు తమ చిన్ననాటి అనుభవాలు జ్ఞప్తికి తెచ్చి, తమ బాల్యం ఎంత అందంగా గడిచిందని తెలియజేస్తాయని పలువురు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు హరి చంద్రుడు, వరుణ్, నాయుడు, రాజు, ఈశ్వర్, పూర్వ విద్యార్థులు రమేష్, వరప్రసాద్, రాంబాబు, వాళ్ళ చంద్రశేఖర్, ప్రసాద్ ఉన్నారు.

పగటిపూట వెలుగుతున్న వీధి దీపాలు

నిరంతరం ఎల్ఇడి వెలుగులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో మున్సిపల్ పరిధిలో ఉన్న పలు వార్డుల్లో పగలు రాత్రీ అన్న తేడా లేకుండానే గత నాలుగు రోజుల నుంచి ఆయా వార్డుల్లో ఉండే విద్యుత్ స్తంభాలకు ఎల్ఇడి లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. వీటి నిర్వహణను చూడాల్సిన మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది చూడకపోవడంతో ఆయా వార్డుల్లోని స్థానిక ప్రజలు పండగ సందర్భంగా విధి నిర్వహణను విస్మరించి ఉంటారనే విమర్శలు గుప్పిస్తున్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

రైలు నుంచి జారిపడిన వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. పార్వతీపురం రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిషాలోని బలంగీర్ జిల్లాకు చెందిన సుశాంత్ మిర్జా బెంగుళూరులో ఇటుకుల తయారీ కేంద్రంలో కార్మికునిగా పనిచేసేవాడు. కూలి పని చేసుకొని ఆ క్రమంలో ఇంటికి వస్తుండగా విశాఖపట్నం నుంచి బలంగీర్ వెళ్లడానికి బొకారో ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తూ పార్వతీపురం మండలం నర్సిపురం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం వద్దకు చేరుకొనేసరికి ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉండడంతో రైలు నుంచి జారిపడ్డాడు. ఈ సంఘటనలో సుశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వెంటనే అతడ్ని పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. పార్వతీపురం జిఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ రత్నకుమార్ వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

పిహెచ్‌సికి సమస్యల సుస్తీ

ప్రకటనలకే పరిమితమైన అభివృద్ధి
రోగులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సమస్య సుస్తీ చేసింది. ఈ పిహెచ్‌సిల్లో కనీస సౌకర్యాలు లేక రోగులకు అవస్థలు తప్పడం లేదు. మండలంలోని వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 24 సచివాలయాల్లో సుమారు 66వేలమందికి పైచిలుక జనాభా వైద్యసేవలు పొందుతున్నారు. ఈ ప్రాముఖ్యత గల ఈ వైద్యశాలల్లో జనాభా తగ్గట్టుగా మౌలిక సౌకర్యాలు, సిబ్బంది లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆరు పడకలకే పరిమితం

వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్న ఆరు పడకలను 30 పడకలుగా విస్తరించేందుకు అభివృద్ధి పనులు చేపడతామని గత టిడిపి ప్రభుత్వ పాలనలో అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావు 2015-2017లో వీరఘట్టం పర్యటనలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి హామీ ఇచ్చారు. ఏళ్లు గడుస్తున్నప్పటికీ నేటికీ ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు కష్టాలు తప్పడం లేదు. ఆరు పడకలే ఉండడంతో రోగులతో నిండుకుంటే మిగిలిన వారికి సిమెంట్ పలకలపైన వైద్యం అందించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీనికి తోడుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బిటివాడ పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న రోగులు

ఇరుగ్గా ఉండడంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు మరిన్ని కష్టాలు తప్పడం లేదు. వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సీతంపేట మండలంలోని పొల్ల, దోనుబాయి తదితర గిరిజన గ్రామాల ప్రజలు ఇక్కడికి వచ్చి వైద్యం పొందుతున్నారు. అలాగే విజయనగరం జిల్లా వంగర మండలం, గరుగుబిల్లి మండలం నుంచి కూడా రోగులు ఇక్కడికి వచ్చి వైద్యం పొందుతున్నారు. ప్రతిరోజు 200పైగా ఒపి రోగులు తాకిడితో ఆసుపత్రి కిటకిటలాడుతుంది. వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటల ఆసుపత్రి కావడంతో అత్యధికంగా డెలివరీలు జరుగుతున్నాయి. ఇక్కడ స్త్రీ వైద్య నిపుణులు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులను ప్రసవం కోసం పాలకొండ, పార్వతీపురం తరలించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బిటువాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మారుమూల ఉండడంతో వీటి పరిధిలో గల గర్భిణీలు 108 సహాయంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ఇదిలా ఉండగా వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోనే చలివేంద్రి, చిన్నగోర, చిదిమి, బిటివడ ఆరోగ్య కేంద్రం పరిధిలోని కత్తుల కవిటి సచివాలయాలకు ఎఎన్ఎంలు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో గర్భిణీలకు, బాలింతలకు, ఐదు, పదేళ్లుదాటిన పిల్లలకు పక్కనున్న సచివాలయం ఎఎన్ఎంల ద్వారా వైద్యం అందించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వైద్యాధికారులు చెబుతున్నారు. ఇక్కడ ఖాళీలను భర్తీ చేయాలని జిల్లా స్థాయి అధికారులకు నివేదికలు కూడా ఇచ్చామని వైద్య అధికారులు చెబుతున్నారు.

పరాయి పంచన విధులు

మండలంలోని వీరఘట్టం, బిటవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల నడుకూరు, నర్సిపురం, కంబర, కత్తుల కవిటి, హుస్సేన్ పురం, వండువ, తూడి సచివాలయాల్లో గల ఆరోగ్య ఉప కేంద్రాల పనులు అర్థాంతరంగా నిలిపివేయడంతో సిబ్బంది పరాయి పంచన విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అదేవిధంగా 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించినప్పుడు భవన సదుపాయం లేకపోవడంతో ఆరుబయట చెట్ల నీడలో రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, ఈ విషయంపై ఎంపిపి మాజీ తాజా ఎమ్మెల్యే దృష్టి కూడా తీసుకెళ్లడం జరిగిందని వైద్యాధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్యమందించేలా ఆసుపత్రులను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వీరఘట్టం పిహెచ్‌సిలో సిమెంట్ పలక పై వైద్యం పొందుతున్న రోగి

ఊట గెడ్డల నీరే దిక్కు!

- కానరాని తాగునీటి సౌకర్యం
- పట్టించుకోని ప్రభుత్వాలు
- గెడ్డల్లోని కలుషిత నీటితో అనారోగ్యం
- ఇదీ గిరిశిఖర గ్రామాల దుస్థితి

ప్రజాశక్తి - కురుపాం

ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గిరిశిఖర గ్రామాల్లో సురక్షిత తాగునీరు కల్పిస్తున్నట్లు ప్రభుత్వాలు గొప్పలు చెప్పడమే తప్ప ఆచరణలో అమలు కాలేదు. అనేక మారుమూల పివిటిజి గిరిజన గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంతో గిరిజన ప్రజలకు సమీప గెడ్డలు, ఊటబావే శరణ్యంగా మారాయి. కలుషితమైన నీటిని గిరిజన ప్రజలు తాగి పలురకాల అనారోగ్యాలకు గురవుతున్నారు. మండలంలోని తిత్తిరి పంచాయతీలో గల గుండం, ఎగువ గుండం, తులసి తదితర గిరి శిఖర పివిటిజి గ్రామాల్లో ఇప్పటి వరకు తాగునీటి సౌకర్యం కల్పించలేదు. సుమారు 60 కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో ఇప్పటి వరకు తాగునీటి బోరు గాని గ్రావిటీలు నిర్మించలేదు. తాగునీటి సదుపాయం లేక తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామానికి సమీపంలోని ఉన్న గెడ్డలు, ఊటబావులను ఆశ్రయించి కలుషిత నీటిని తాగడానికి ఉపయోగిస్తున్నారు. కలుషితమైన నీరు తాగడం వల్ల ఆయా గ్రామాల్లోని గిరిజనులు టైఫాయిడ్, పచ్చకామెర్లు, కడుపునొప్పి వంటి వ్యాధులకు నిరంతరం గురవుతున్నారు. రానున్న వేసవి నేపథ్యంలో ఎండల తీవ్రతకు ఊటగెడ్డ నీరు కూడా ఇంకిపోయే పరిస్థితులు ఉన్నందు గ్రామాల్లో తీవ్రమైన తాగునీటి కొరత ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో సురక్షితమైన తాగునీటి సౌకర్యం కల్పించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా చర్యలు తీసుకునే దాఖలాల్లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత, ప్రస్తుత పాలక ప్రభుత్వాలు తాగునీటి సమస్యపై దృష్టి సారించలేదు. రానున్న వేసవిలో నేపథ్యంలో ముందస్తుగా కూటమి ప్రభుత్వంలోనైనా పాలకులు, అధికారులు స్పందించి గ్రామాల్లో గ్రావిటీ పథకం నిర్మించి సురక్షితమైన తాగునీరందించాలని గిరిజన ప్రజలు కోరుతున్నారు.

ఊట గెడ్డలో నీటిని తోడి కొండల మధ్య నుండి ఇంటికి తీసుకు వస్తున్న గిరిజన మహిళలు

అభివృద్ధికి దూరాన చింతమానుగూడ

సమస్యలతో సహజీవనం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కుక్కిడి పంచాయతీ చింతమానుగూడ గ్రామ గిరిజన ప్రజలు సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. ఈ గ్రామం ఏర్పడి 40 ఏళ్లు అవుతున్నా అభివద్ధికి దూరంగానే ఈ గ్రామ గిరిజనులు ఉన్నారు. ఎన్నో ప్రభుత్వాలు, ఎంతో మంది అధికారులు మారినా సమస్యలకు పరిష్కార మార్గం చూపలేదు. గ్రామంలో 20 కుటుంబాలు ఉండగా 220 మంది జనాభా ఉన్నారు. గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేదు. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనంపై కప్పు రేకులు ఈదురు గాలులకు పూర్తిగా పాడయ్యాయి. ప్రస్తుతం గ్రామంలో ఓ ఇంటి వద్ద విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. పక్కా గృహాల్లేవు. రేకిళ్లలోనే జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం, ఐటిడిఎ నుంచి ఎటువంటి రుణాలు, రాయితీలు అందలేదని గిరిజనులు తెలిపారు. తమ గ్రామం పై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

అభివృద్ధికి దూరంగా ఉన్న చింతమానుగూడ

శిథిలమైన పాఠశాల భవనం

అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న టేకు దుంగలు

కలప స్మగ్లర్లకు అడ్డాగా ఏజెన్సీ

ప్రజాశక్తి - సీతంపేట

అడవిని సంరక్షించుకోవాలని, ప్రతి ఒక్కరూ ఒక మొక్కలు నాటండి దానివల్ల అడవి సంపద పెరుగుతుంది. వన్యప్రాణులు సంపద పెరుగుతాయి. వాతావరణం సముతుల్యంగా ఉంటుందని ప్రభుత్వాలు అధికారులు పదేపదే సార్లు చెబుతున్నప్పటికీ కలప అక్రమార్కులు ఆ సూక్తులు పెడచెవిని పెడుతున్నారు.. సీతంపేట ఏజెన్సీ కలప స్మగ్లర్లకు అడ్డగా మారింది. రాత్రీ, పగలు అన్న తేడాలేకుండా అన్ని వేళల్లో యథేచ్ఛగా ట్రాక్టర్లు, పికప్ వ్యాన్ల ద్వారా కలపను అక్రమంగా తరలిస్తున్నారు. ఏజెన్సీలో టేకు దుంగలు, మద్దిస, పనస, మామిడి తదితర కల్పవృక్షాలకు ప్రసిద్ధి. ఏజెన్సీలో పూతికవలస మర్రిపాడు ధోనుబాయి, పొల్ల, శంభాం, కడగండి తదితర ప్రాంతాల నుంచి కర్రల మిల్లులకు కలప తరలిపోతుంది. దీనికి సంబంధించిన అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీలో ఉన్న కలపకు ఎక్కువగా సేవ ఉంటుందని గృహాలకు, ఫర్నీచర్‌కు ఇక్కడ కలప వాడ్డానికి మైదాన ప్రాంతంలో మంచి డిమాండు ఉంది. అయితే గతంలో హుదూద్, తిత్లీ తుఫాన్‌లో అదే అలుసుగా తీసుకొని నేలకొరిగిన కలప కన్నా కలప అధికంగా తీసుకెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సంక్రాంతి సీజన్‌లో అధికారులు, ప్రజలు బిజీబిజీగా ఉంటే దాన్ని ఆసరాగా తీసుకొని కలప స్మగ్లర్లు అలుసుగా తీసుకొని వాహనాల్లో అక్రమ కలప రవాణా చేస్తారు. కొత్తూరు, ఆముదాలవలస, రాజాం, పాలకొండ కర్రల మిల్లులకు వాహనాల ద్వారా కలప రాత్రి వేళల్లో తరలిపోతుంది. కలప స్మగ్లర్లకు వర్షాకాలం చలికాలం అనువుగా ఉంటుంది. అందుకే ఈ కాలంలో మరింత ఎక్కువగా కలప రవాణా చేయడానికి సన్నాహాలు చేస్తారు.

ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు మొదిలి కన్నుమూత

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు మొదిలి శ్రీనివాసరావు (65) కన్నుమూశారు. గురువారం ఉదయం విశాఖలోని తన నివాసంలో నిద్రలోనే గుండెపోటుతో మృతి చెందారు. ఆయన నిద్రలోనే విశాఖలోని తన గహంలో హద్రోగంతో మతి చెందినట్లు కుమారుడు కౌశిక్ గుర్తించారు. వెంటనే శ్రీనివాసరావు భౌతికకాయాన్ని విజయనగరంలోని ఆయన స్వగృహానికి తరలించారు. పెద్ద ఎత్తున కార్మికులు, అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు మొదిలి శ్రీనివాసరావు భౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయనకు భార్య కమలావతి, ఇద్దరు కుమార్తెలు ఇందిరా సంయుక్త, నాగదుర్గ నివేదిత, కుమారుడు కౌశిక్ ఉన్నారు. ఈయన 1983 ఎన్నికలలో విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున అశోక్ గజపతిరాజుపై పోటీ చేసి ఓడిపోయారు.

కొనసాగుతున్న కానిస్టేబుల్ నియామక ప్రక్రియ

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్టయిఫండరీ పోలీసు కానిస్టేబులు ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు దేహ ధారుడ్య ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఈ ఎంపిక ప్రక్రియకు గురువారం పిఎంటి, పిఇటి. పరీక్షలకు 600 మంది పురుష అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 415 అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. వారిలో 314 మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు అర్హత సాధించారు. నియామకాల ప్రక్రియ వేకువ జామున 5గంటల నుండే ప్రారంభం కావడం, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతో సకాలంలో పూర్తయ్యాయి. అయితే పలువురు అభ్యర్థుల పుట్టిన తేదీ పోలీసుశాఖ పంపిన కాల్ లెటర్లలో తప్పుగా పడడంతో వారిని ఎంపిక ప్రక్రియలో పాల్గొనేందుకు అధికారులు నిరాకరించారు. ఆ తప్పును సరిచేసి పోలీసుశాఖకు మెయిల్ ద్వారా పంపి, అక్కడ నుంచి అనుమతి వచ్చిన తరువాత దేహ దారుఢ్య పరీక్ష నిర్వహిస్తామని పోలీసు అధికారులు తెలిపారు. 24గంటల్లో అనుమతి మంజూరు ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందని అభ్యర్థులు తెలిపారు. పోలీసు నియామకాల ప్రక్రియను జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు. అభ్యర్థులకు ముందుగా హాల్ టిక్కెట్లును పరిశీలించి, పోలీసు పరేడ్ గ్రౌండులోకి అనుమతించారు. అనంతరం, అభ్యర్థుల విద్యార్హతలు, రిజర్వేషన్లు, వయస్సు నిర్ధారించే ధ్రవపత్రాలను పరిశీలించి, అన్ని సర్టిఫికేట్స్ సక్రమంగా ఉన్న అభ్యర్థులకు మాత్రమే బయోమెట్రిక్ తీసుకొని, పి.ఎం.టి. పరీక్షలకు అనుమతించారు. ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగిన డిజిటల్ ఎక్విప్‌మెంట్స్ వినియోగించి, అభ్యర్థుల ఎత్తు, ఛాతీ కొలతలను నిర్ధారించి, అర్హత సాధించిన అభ్యర్థులకు పిఇటి. పరీక్షలను అనుమతించామని ఎస్‌పి వకుల్ జిందల్ తెలిపారు. నియామక ప్రక్రియలో అదనపు ఎస్పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పి జి.నాగేశ్వరరావు, డిఎస్‌పిలు ఎం.వీరకుమార్, యూనివర్స్, ఎస్.రాఘవులు, టి.ఎస్.శ్రీనివాసరావు, కే.థామస్ రెడ్డి, ఎఒ పి.శ్రీనివాసరావు, పలువురు సిఐలు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పిఇటిలు పాల్గొన్నారు.

లాంగ్ జంప్ చేస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థి

బస్సు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

తిరుగు ప్రయాణంలో తిప్పలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సంక్రాంతి నేపథ్యంలో ప్రయాణికులకు తిరుగు ప్రయాణంలో కూడా తిప్పలు తప్పడం లేదు. సంక్రాంతి, కనుమ పండుగ ముగించుకుని గురువారం విధులు నిర్వహించుకునేందుకు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు వలస కూలీలు, ఉద్యోగస్తులు ఆర్‌టిసి బస్సులు కోసం పడరాని పాట్లు పడ్డారు. సకాలంలో బస్సులు లేకపోవడం.. వచ్చిన బస్సులు కూడా కిక్కిరిసిపోవడంతో నానా ఇబ్బందులుపడ్డారు. ఎక్కువ బస్సులను విజయవాడ, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు తరలించడంతో ఈ సమస్యలు తలెత్తాయి. శ్రీకాకుళం, పాత గాజువాక, అనకాపల్లి, సాలూరు రూట్లలో ప్రయాణికులు ఎక్కువగా ఉండడం, అందుకు తగ్గ బస్సులను కేటాయించకపోవడంతో ప్రయాణికులు ఒకింత అసహనం వ్యక్తం చేశారు.